
ఆకలి అన్ని దారుణాల్నీ, అన్యాయాల్ని సహిసుంది అందుకే దాన్ని తిరుగులేని ఆయుధంగా చేసుకున్నారు పెత్తందారులు! ఆకలి కడుపులో యుగయుగాల మానవజాతి నెత్తురూ, కన్నీళ్ళూ కలగలసి కనిపిస్తాయి.



ఓ...పిల్లో..., ఓ..పూలం-పూలమ్-పూలమ్మో-ఆగు...ఆగాగాగు...ఆగవే,..నేనా తన్న.

గూనోడి గుట్ట దిగువన, లోయ కివతల, పరిగ చెట్టెక్కి పళ్ళు తింటూన్న తానంగి, అడవి దాటి గూడెం బాటన పోతున్న పూలమ్మను చూసి గొంతు చించుక కేకేసింది.

పూలమ్మకా కేకందలేదు.

ఎండాకాలం –

నడినెత్తికి నిక్కిన సూరీడు - కొలిమి లోని బండి గిరకలా వున్నాడు. కొరివి దెయ్యం పట్టిన కోయపడుచులా - వడగాలి. - ఓ నీతీ, రీతీ, లేకుండా సుడులు సుడులుగా పరుగులు పెడుతూంది. పగిడిద్దె రాజు (కోయ జాతుల్లోని ఓ జాతికి దేవుడు) కొలుపులో పూనకం వచ్చిన పూజారిలా చెట్లు విరగ వూగుతున్నాయి.

తానంగి బెంబే లెత్తుతూ. లబొలబో మంటూ నెత్తీ, నోరూ, బాదుకొంది, చెకచెకా చిటారుకొమ్మల్లోకి చేరి. మళ్ళీ మళ్ళీ గొంతు చించుకొంది.

పూలమ్మ వెనుదిరిగి చూసింది కాదు.

"సెవిటి లమ్డి కినపట్లంలే...." అను కొని తరతరాలుగా అలవాటయిన బూతు కూతలు కూస్తూ చెట్టు దిగింది తానంగి.

కూతవేటు దూరంలో పూలమ్మ గాలి దెయ్యంలా ఊగుతూ, ఊగుతూ అడుగు లేస్తూంది. "కొద్దిగైతే పోర్ది గుట్టెనక మాయమైద్ది" ఉబుకుతున్న దుఃఖాన్ని దిగమ్రింగుతూ గొణిగింది. చుట్టూ రా చూసింది.

ఎండ పొడలుపొడలుగా కదులుతూంది. కనుచూపు మేర-మనిషి అలికిడికనిపించడం లేదు. తానంగిలో అప్పటివరకూ రెపరెపలాడుతున్న భయం- క్రమంగా పెరుగుతూ నరాలవెంటసాగింది అంతవరకూ మామూలుగా వినిపించినపక్షులఅరుపుల్లోనేఎన్నడూ తోచని వికృత ధ్వనులు తోచేయి. ఎండుటాకుల సవ్వడుల్లో- కనిపించని ఆకారాల కదలికలు....పొదలమాటున ఏవో-ఏవేవో పొంచి వున్నట్టుగా. తల నరాలు తెగేలా- ఊహలు! గుండెలు వాడిసిపొయ్యేలా- జలదరింపు! భయం- మనిషిని మించి పోయింది. వణుకు-సాయంకాలపు నీడలా పెరిగిపోతూంది

బెదురుతో బాటకేసి చూసింది. గుట్టెనకనుండి దారి మలుపు తిరిగిన పూలమ్మ-పొట్టవేసిన పొలంలో దిష్టిబొమ్మలావుంది.

"ఓ..... సే.....పూలమ్మో..." కొడిగట్టి పోతున్న ఆశలో కంఠనాళాలు తెగిపోయేయన్పించేంత భీకరంగా అరిచిందితానంగి.

అడవి "మ్మో....." అంటూ మారోమ్రగింది గుట్టెనక గురకతీస్తున్న అడవి మనిషి తంతెలు తంతెలుగా ఆవలించేడు.

తానంగికి ఏడుపు రావటంలేదు. గొంతు నెవరో నొక్కేస్తున్నట్టుగా వుంది. ధైర్యం పిరికిదానిలా వరుగుతీసింది మదిలోకి గాలిదెయ్యాలూ, పగటి దెయ్యాలూ చేరి

కోడిపేనులా కొరక సాగేయి కనుపావల్లో రాకాసులూ. కొండముచ్చులూ గుడ్లెలుగులూ, అడవి పందులూ.... అమాంతం మనిషి మీద పడి పీక్కుతినే రకరకాల జంతువులు కదిలాడసాగేయి

తానంగి అరికాళ్ళలో వణుకు - అడుగెయ్య నీయడం లేదు. కట్టెల్ని వదిలేసి వురికినా పూలమ్మ కలుస్తుందన్న నమ్మకం చచ్చిపోయింది. కట్టెల్ని వదిలేసి పోడానికీ మనసొప్పలేదు. నడుమున చుటుకొన్న ఇప్పతాడు తీసి భూమ్మీదేసి నలువక్కలా కాపేసి చూస్తూ కట్టెల్ని మోపే సింది. మోకాలి బిగువులో నెత్తికెత్తుకుంది.

ముందు కడుగేసేసరికి లంగా బొందులో దోపిన కొడవలి పిర్రకు కుచ్చుకుంది కొడవిలినో తిట్టుతిటి. ఎడమ చేత్తో తీసి మోపులో దోపింది గాలివాటున ఎగిరిపడే పవిటను లాగిపడేసి. తలచుట్టగా పెట్టుకొంది.

సగం నలిగిన సన్నని కాలిబాట-

కలెం పొదలూ, బలుసు పొదలూ బాటకిరువైపులా పరుచుకున్నాయి. పైగా ఎదురుగాలి. నిప్పుల నేల తానంగి అడుగెయ్యడం విద్యలా వుంది లంగా అంచుల్ని ముళ్ళపొదలు ముద్దాడుతుంటే గోచీ పెట్టుకొంది- నడుస్తూనే.

తానంగి అడవికి రావటమూ వొంటరిగానే వచ్చింది పట్టపగలు వొంటరిగా అడవికి రావడానికి ఎవరూ ధైర్యం చేయరు. దెయ్యాలు తిరుగుతుంటాయని నమ్మకం కాని "యిప్పుడిప్పుడే సుద్దుల పూలమ్మ పోయింది పరిగెత్తు. కలుస్తాది" అని ఒకరిద్దరన్నారు. ఆ ఊతంతో వచ్చింది.

సీటిలో దుంగా, అడవిలో మనిషీ అంత సులికగా దొరకరని తానంగికి అనుభవం లేదు

అడవిలో ఆ పండూ, ఈ పండూ కనిపించేసరికి తానంగి పూలమ్మను మరిచిపోయి పళ్ళు ఏరుక తింటూ కనిపించిన కట్టెల్ని కుప్పేయసాగింది ఆ చుట్టుపక్కల్లోనే పూలమ్మ వుంటుందనే ధైర్యంతో సరిగ్గ వెదెక్కింది. తీరా- పూలమ్మ వెళ్ళిపోతూ కనిపించేసరికి ఆమె ధైర్యం కాస్తా ఉండేలు దెబ్బతిన్న పిట్టపిల్లలా అయిపోయింది.

వెనుకగా- ఎవరో వస్తున్నట్టుగా తోచి. తిరిగి చూసింది తానంగి.

ఎండు టాకులు గలగలా నవ్వేయి. గాలి గుర్రుమంది. పిచ్చి పిచ్చి మొక్కలు వెక్కిరించాయి. తానంగిలో భయం- జిప్పున పొంగింది. నెత్తిమీది కట్టెల మోపు నిలవడం లేదు. ఒకటీ రెండు పుల్లలు జారిపోయేయి. మోపు వదులయింది. తలచుట పాటు తప్పింది. తల మోపులో దిగబడింది. అయినా తానంగి ఆగి, మోపును సరిచేసుకోవా లనుకోలేదు. అడవి త్వరగ దాటాలనే ఆశతప్ప మరోటి లేదామెలో.

దూ-రా-న పూలమ్మ పొండ పొడల కావల బూజర బూజరగా రంగు రంగుల పంగల కర్రలా వుంది.

గాలి వరదలో అడవి హోరెత్తిపోతూంది. ఎండ చెంపలపై నిప్పు చిటిక లేస్తూంది. "న్నీ........యవ్వ.... కూడు లేకుంటే మానె. ఈ ఎండ వెళ్ళిందాకా అడవి మొగం సూత్రె అసిద్దం తిన్నం





మీనా: చురుకైనది. విశాలాక్షి. తీవ్రవాది
"నేను మంచి వస్తువులను కోనగానే
పోల్చగలను" అన్నాది ధాటీగా.
దిగ్భ్రమగల్గించే ఆమె ధరించిన చీరయే
దీనికి నిదర్శనం.
"అది మీరే కొన్నారా?" అన్న ప్రశ్నకు
"లేదు, మా అమ్మ. చూడండి, మంచి అభిరుచి
మా వంశ పారంపర్యంగా వస్తూన్నది"
అని జవాబిచ్చింది.
ఎంటైస్ - షర్టింగులు, సూటింగులు, చీరెలు.

నేషనల్ టెక్స్టైల్ కార్పొరేషన్ (తమిళనాడు మరియు పాండిచెరి) లి.
భారత సర్కారపు ఒక ఉద్యోగ సంస్థ
10 64 సోమసుందరం మిల్ రోడు. కోయమత్తూరు-641009

ఇండెంటింగ్ ఏజెంట్లు: (ఆంధ్ర ప్రదేశ్-ఉత్తరం) బాలాజి ట్రేడింగ్ కంపని., 2-2-4 పాన్ బజారు, సికిందరాబాదు 3.
(ఆంధ్ర ప్రదేశ్-కోస్టల్) సంగం టెక్స్టైల్స్ ఏజెన్సీస్, 230-డి.బి. రోడు, ఆర్.ఎస్. పురం, కోయంబత్తూరు 12.

SUPER SOFT COTTON
Tango®
BRIEFS
Tango®
BANIANS

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే వర్ణము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు:
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

డా. పి. వి. కె. రావ్, B.A. సెక్స్ స్పెషలిస్ట్

వైద్య విద్వాన్ — వైద్యాచార్య
హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, స్వప్నస్కలనము, శుక్లనష్టము మొ. రోగములకు, మానసిక బాధలకు శాస్త్రీయ చికిత్స, పోస్టుద్వారాకూడాచికిత్సగలదు.
రావూస్ క్లినిక్,
టి.బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

శ్వేతవర్ణపు మచ్చలు

SHYAM AYURVED BHAVAN
P.O. KATRI SARAI (GAYA)

తొట్టు." అని ఆ చికాకు, కోపంలో అయ్యనమ్మల్నీ, గాలీ, ఎండనీ నెత్తిమీద మోపునీ కలిపి నోటి కొచ్చినట్టు తిడుతూ మధ్య మధ్య ఉలిక్కిపడుతూ బెదురుతూ సగం చచ్చినట్టు.... మరో సగం చస్తున్నట్టు సగం నడకే అనుకొంటూన్న పరుగుతీస్తూంది తానంగి.

తానంగి వయసు పద-మూడో. నాలుగో వుండొచ్చు. పిల్లకి వొళ్ళొస్తుంటే గమనించి ఎక్కడ గాలి తగులుద్దోనని తల్లి-పున్నానికి ముందు పగిడిద్దరాజుకు పెట్టుకున్ననాడు— తన పాత చీరను చింపి, పవిటేయించింది రేపో మాపో పిల్ల మూలన కూచుంటుందని. ఓ పావలా బెల్లం, గిడెడు నూకలూ సంపాయించి ఉట్టిమీద దాచింది.

తానంగి కా ఊసేలేదు. ఆటకోగింతనమింకా వదల్లేదు. చేతనైనంత సేపు గుడిసెలో తోచిన పని చెయ్యడం. గుబులెత్తినప్పుడు ఆడుకోవడంలో ఆమెకే రకమైన యిబ్బందీ కలగడం లేదు.

తునికాకు కాలం వెళ్ళి, ఎండలు ముదిరేక - ఇహ - ఆ గూడేన్ని రొండు నెలల దాకా పనికి పిలిచే వారుండరు. వానదేవుడు దయతలచి కన్ను తెరిస్తే (!) కురిసే వర్షం కోసం చూడమని తప్ప, ఎవరూ ఏపనీ చెప్పరు. చెప్పలేరు.

కూలి దొరకనిదే కడుపు నిండడానికి ఆధారాలు కొదువైన కోయలను ఆ సమయంలో అడవి ఆదుకొంటూంది. తేనెతెట్టెలూ, గుట్టగడ్డీ, కట్టెపుల్లలూ పోగేసి ఇల్లెందులో అమ్ముక బతుకుతారు.

ఆ పనీ చేతగాని ముసలా ముక్కా— బొద్దింకాకు, రొట్టాకు, ఉప్పుగల్లుతో ఉడకేసుకి తింటారు. అడవిమీదపడి అప్పనంగా బతుకుతున్నందుకు చౌకీదార్ ప్రతి కోయవానినుండి గుడిసెకు ఐదు రూపాయలు వసూలు చేసుకొంటాడు. ఒకరిద్దరు అలా బతికేందుకు వోపిక లేకున్నా మామూలు- మామూలే. చౌకీదార్ దయదలచి వొదిలేస్తేతప్ప. పటేల్ జబర్దస్తీగా వొసూలుచేసి యిస్తాడు. తర తరాలుగా అచారంగా మార్పు పొందిన అలవాటది.

తానంగి తలిదండ్రులు మూలచుక్కతో పాటు లేచి, పెద్దడివికి పోయేరు. అన్న కుంచాలయ్య "గిరిజన సంఘం" మీటింగుకని యిల్లెందు పోయేడు. ఇంటిపట్టున వున్న తానంగి వున్న సోలెడు జొన్నలు తొక్కి గటక కాసింది. ఆ వెనుక చేసే పనేదీ తోచక అడవిలో పళ్ళు తినేందుకు కట్టె పుల్లల వంకతో బయలుదేరింది. పూలమ్మ కనిపించకపోవడంవల్ల ఆమె ఆలోచనలన్నీ తల్లకిందు లయ్యేయి.

## బాల గోపాలం



"అంతా అప్పోయింది"
ఫొటో : సి రమాకాంత్, కాకినాడ

తానంగి ఎంత త్వరగా నడవాలనుకొన్నా కుదరడంలేదు. గాలివాటున కట్టెల మోపు అడ్డం తిరుగుతూంది.

దాపున పొదలో ఏదో అలికిడయింది. తానంగి వులిక్కిపడింది. కట్టెలమోపు జారిపడింది తోడుగా లోయలోగిలి నుంచి గుడ్డగూబ అరుపు. ఆమె గుండెలు పిండైపోయేయి. ఎండుటాకులమీద తొండ పరుగు. మీదిమీదికొస్తున్న దెయ్యం అడుగుల్లా తోచేయి. వొజవొజా వొణుకుతూ కీసుపిట్టలా" "సత్తినయ్యో" అని కేకేస్తూ పరుగు తీసింది.

* * *

తానంగికి ఆయాసంగా వుంది.

గాలి శ్వాస కందడంలేదు. కాళ్ళు తూలిపోతున్నాయి. అయినా పరుగాపలేదు. యింకాస్త దూరం గడిస్తేనేగాని అడవి దాటదు.

"ఏయ్! తయిరో...." గాలి గద్దింపులా. దెయ్యం అరుపులా చెట్ల మధ్యనుంచి కేక! తానంగి ఉలిక్కిపడింది. ఉన్న సత్తువనంతా కాలి గిట్టల్లోకి నెట్టేసింది.

"వామ్మో...." కేకేస్తూ, తూలి పడబోయి, నిలదొక్కుకుంటూ పరుగు పుర్వడి చేసింది.

"ఏయ్.... బచ్చీ, ఆగాగు.." మరింత స్పష్టంగా విన్పించింది.

తానంగి కాళ్ళకు బంధాలు పడినట్టు ఆగిపోయింది. ప్రాణాలెగిరిపోయిందానిలా కొన్ని క్షణాలు.... సమస్త విశ్వం శూన్యంలా కనిపించింది. నిలువెల్లా వొణుకుతూ బెదురు కన్నులు కదిల్చింది.

# నేనొక అబలను!

నేనొక అబలను
మెరుస్తున్న ఎడారి అద్దం నా చర్మం
గుబాళిస్తున్నవి ఫ్యాక్టరి పొగ
వాసనతో నా తలవెంట్రుకలు

నేనొక అబలను —
బాధలనే చురకత్తుల గాయాలతో
క్రుంగుతున్నాను క్షతగాత్రనై
అయితే సిగ్గు విడిచి కటికి నవ్వు
విసరుతావా!
నన్ను చూచి ఇలా వెక్కిరిస్తావా!!
నా ఆకలి అబద్ధమని
నా నగ్నత్వము నమ్మే నిజమని.

ఆంగ్ల మూలం :
కీ॥ శే॥ మర్జె అహమది
ఓస్కూయ్
(ఇరాన్ విప్లవ రచయిత్రి)

అనువాదం :
ఇటిక్యాల మాణయ్య

(ఈ విప్లవ రచయిత్రి తన జీవితాంతం ఇరాన్ చక్రవర్తికి వ్యతిరేకంగా పోరాటం సల్పి, ప్రజా ఉద్యమాలలో పాల్గొని అనేక విప్లవ గీతాలు వ్రాశారు 1973 మేలో ఇరాన్ చక్రవర్తి సైనికులు ఈమెను కాల్చి చంపారు. వీర మరణం పొందిన విప్లవ రచయిత్రి ఈమె.)

---

అడవి కడ్డంగా కొద్దిదూరంలో చౌకీదార్ మస్తాన్ వస్తూ కనిపించేడు. బాగా పరిచయమున్నతనే! ప్రతి ఏడాది - తమ దగ్గర ఐదు రూపాయలు వసూలు చేసేతనే!

తానంగి గుండెల్లోంచి ఓ బలమైన ఊర్పు వెలువడింది. కొండంత ధైర్యం కూడుకొంది. భయం నేటగాని పసిగన్న పావురమైంది. తన తండ్రి తనకోసం ఎదురుచూస్తున్నట్టు తోచింది. వణికే శరీరాన్ని అదుపుచేసుకొంటూ, ఆయాసం తీర్చుకొంటూ చెట్టు పీడన నిలుచుంది.

చౌకీదార్ దగ్గరగా వొచ్చేడు. చంకనున్న నీళ్ళ తిత్తిని. చేతిలోకి తీసుకొంటూ "క్యా బచ్చీ.... వురుక్కుతుండావ్?" అన్నాడు.

తానంగిలో వణుకూ, ఆయాసం పూర్తిగా తగ్గిందికాదు. నాలిక పిడుస గట్టుకపోయింది. మాట పెగల్లేదు.

చౌకీదార్ ఆమె అవస్థను గమనించేడు. తిత్తి నందిస్తూ "త్రాగు" అన్నట్టు సైగ చేసేడు.

తానంగి కన్నుల్తోనే దండంపెట్టి తిత్తి నెత్తింది.

చౌకీదార్ సునిశితంగా గమనించేడామెను.

చింపర వందరగా ముహంమీద పడుతున్న వెంట్రుకలు. విరబూసిన లేతపసుపు గులాబిపై మంచు బిందువుల్లా మొహం నిండా చెమట చుక్కలు. చెమటకు తడిసిన రవికలోంచి చెక్కు చెదరని చిన్ని బంతుల్లా ఓ స్ఫుటమైన ఆకృతిని సంతరించుకునేందుకు వుబలాటపడుతున్న వక్షోజాలు. ఏ అవయవంలోనూ నిండు యవ్వనం కదిలాడకపోయినా మొత్తంగా చూస్తే అప్పుడప్పుడే విచ్చుకొన్న ముద్ద మందారంలా వుంది.

చౌకీదార్ గుండె లోతుల వెనుక- మృగ మృగం ఒళ్ళు విరుచుకొంది. న్యూనతగా నలుదిక్కులా చూసేడు.

నీళ్ళు త్రాగి తేన్చుతూ "దొరో... తవ్వ్రాకుంటే దప్పికై సచ్చేదాన్నే.... మా బయిసేసింది" అని తేలికగా నవ్వింది.

బదులుగా ఓ గుంభనమైన నవ్వొదిలి. బీడీ వెలిగించేడు. పొగను తానంగి మొహం మీదకు వదిలేడుగాని. గాలికి నిలువలేదు చిలిపిగా చూసేడు. "ఎందుకా భయం?" అంటూ బెరుకు చూపు చూస్తూ సైపై చొరవతో ఆమె భుజంపై చేతి నుంచేడు.

తండ్రి చంకలోని పావలా అమాయకంగా నవ్వింది తానంగి, మనస్సు నిలకడయింది.

చౌకీదార్ నెమ్మదిగా చేతిని కదుపుతూ. వీపంతా తడుతూ. తడుతూ, కొనవేళ్ళతో వొత్తుతూ. వొత్తుతూ. మత్తుగా చూడసాగేడు.

తానంగికి ఏదోలా వుంది. ఏదోపురుగు వీపు మీద ప్రాకుతున్నట్టుగా వుంది. "పోతన్ దొరా...." అంది.

"నెనొత్త మీ గూడెం, పోదాం కూకో...." అన్నాడు.

"వొద్దు దొరా.... మయ్యేదురు సూత్తుండాది."

"అరె.... పోదాం. కూకోరాదూ?.." అని తానంగి రెక్కపట్టుక లాగేడు చౌకీదార్.

ఊహించని పాటుకు తానంగి - చౌకీదార్ కాళ్ళ ముందు పడింది. బెదురుగా.




## కార్టూన్‌కు కనపడని వాడీ- వేడీ!

ఒకోసారి తెల్లకాగితంమీద గీసిన గీత వల్ల శరీరంమీద వాతకూడా తేల్తుందనే



విషయం తెలీని రోజుల్లో తెలిసీ తెలియని గీతలు గీస్తే అవి షిప్‌యార్డ్ హౌస్ మేగ్జయిన్‌లో తొలిసారిగా ప్రింటయి చదివిన వాళ్ళందర్నీ నవ్వించాయి. కొంతమంది భుజాలు కూడా తడుముకున్నారు అప్పుడే తెల్సింది కార్టూన్‌కి కనబడని వాడి, వేడి వుందని. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి వారపత్రిక వారు నిర్వహించిన క్రొత్త కార్టూన్ శీర్షికలో మొటమొదటిసారిగా బహుమతి లభించింది. అదే శీర్షికలో రెండోసారి కూడా బహుమతి వచ్చినటు గుర్తు.

దాంతో నాలో ఒక్క పిసరంత శక్తి ఏదోమూల్న దాగి వుందని అనుమానం వేసి దాన్ని పైకిలాగి - పెట్టుబడిగాచేస్తే యింతవరకూ రెండువందలకి పైగా కార్టూన్లు వివిధ పత్రికల్లో ప్రింటయ్యాయి. ఇవిగాక ఈ మధ్య నిర్వహించిన కొన్ని కార్టూన్ పోటీల్లో ఎవార్డులు, ప్రశంసాపత్రాలుకూడా వచ్చాయి.

నేను బి.ఎస్. రాజు పేరిట కార్టూన్లు వేస్తున్నా, పూర్తిపేరు బొంది సత్తిరాజు. పుటి పెరిగింది, విద్యాభ్యాసం కాకినాడలోనెనా, ఉద్యోగం విశాఖ- షిప్‌యార్డు కాబట్టి సొంతఊరు విశాఖపట్నమే!

— బి. యస్. రాజు

## బాల గోపాలం



ఆకులందున అణగిమణిగి

చూసింది. కనుకొనల్లోకి నీరొచ్చింది. గుండెలు దడదడ మన్నాయి. దీనంగా లోలోనే వాపోతూ చూసింది.

చౌకీదార్ కళ్ళతో వళ్ళతో నవ్వుతూ "ఇగ్గో.... నీకి మంచి మాట సెపుత. రూపాయిస్త అరవకు" అంటూ శరీరాన్ని పిసుకుతూ, కదుపుతూ రవికలోకి చేతిని పోనిచ్చి.....

తానంగి అడ్డగిస్తూ దాదాపుగా ఏడుపులా మూలుగుతూ.... నోరు తెరవడానికి గొంతు నెవరో నొక్కేస్తున్నట్టుగా వుంది.

"ఇగ్గో నీకి సెపుతున్న. నీకేంగాదు. అరిత్తె గొంతు పిస్కుత" గుర్రుమంటూ అన్నాడు.

అసమ్మతితో, అసహ్యంతో మెలికలు తిరుగుతూ ఏడుస్తూ బయటపడాలని ప్రయత్నిస్తూ— తానంగి.

కాని—

చౌకీదార్-నలభై సంవత్సరాల జీవితం ఇరవై సంవత్సరాల స్త్రీ అనుభవం. ఆమె ప్రయత్నాలన్నిటినీ కట్టగట్టేసి, తానేం కావాలని కోరుకున్నాడో.... అది-

## 2

గూడెం నడిబొడ్డున. ఏల్పుల చింత కింద, మొద్దుమీద- కోయదొర- వరదయ్య గూడెంపటేల్-ఎంగలయ్య కూచొన్నారు. ఇద్దరి-వయసూ దాదాపు డెబ్భయి దాటుతున్నా వారిలోగాని, వారి మాటల్లోగానీ వణుకూ, బెణుకూ లేదు. ఇప్పుడిప్పుడే-మరో పదేళ్ళదాకా మంచమెక్కరనిపించేంత దృఢంగానూ, ఆరోగ్యంగానూ వున్నారు.

వారి కెదురుగా-కొద్దిదూరంలో తానంగి తండ్రి- జొన్నయ్య ముద్దాయిలా నిలుచున్నాడు. మొహంలో కత్తివాటుకైనా నెత్తురుచుక్క కనిపించనంతగా పాలిపోయిన రోగిష్టి శరీరం. బుడ్డగోచి తప్ప వంటిమీద నూలుపోగు లేదు. ఆశలు వుడిగిన, అన్యాయమైపోయిన జీవితాల తాలూకు అనూహ్యమైన దీనత్వానికి ప్రతిరూపంగా నిల్చొని చేతులు పిసుక్కొంటున్నాడు.

అతని ప్రక్కగా చినిగిన చింపిరి బొమ్మలా నెత్తురు చిమ్మి పారేసిన రాతి బొమ్మలా తానంగి! ఆమెముందు కుప్పేసి వున్న నెత్తురు లంగా రాబందులు తన్నుకొచ్చిన మాంసపు ముద్దలా వుంది.

నలు ప్రక్కలా బతుకు తీపి పెంచిన భావ పరంపరలో నలుగుతూ, నసుగుతూ కొందరు బాధతో, ఆవేశంతో అంటీ అంటని మనస్తత్వంతో కూచున్నారు.

నిశ్శబ్దాన్ని దుఃఖావేశంలో ఖూనీచేస్తూ జొన్నయ్య "చెప్పరాన్నా.. చెప్పు! ఈ గూడేనికి దొరవి. నువ్వేం సెపితే అదే నాగ్గీటు! నీ మాట దాటేది కల్ల.... ఈ ఘోర్నాన్ని సరిచెయ్యనా?" అన్నాడు బిడ్డను చూసి.

దొరగానీ, పటేల్‌గానీ చప్పున సమాధానం యివ్వలేకపోయేరు. జొన్నయ్య బాధను పంచుకుంటున్నట్టుగా చూసేరు.

జొన్నయ్యలో సహనం సన్నగిల్లింది. మంచో, చెడో దొర నోటి నుంచి రాకపోవడంతో. తాను అయినవానికే కొరగాకుండా పోతున్నట్టుగా ఎంచుకొంటూ, "చెప్పవేరన్నా.... ఏందా నసుగుడు?.... యియ్యాల్నుంచి యిది నా బిడ్డ కాద్రా! కులానికే వొదిలేత్తున్న. కులం పగిడిద్దె రాజుకే బలియ్యనీ. అడివిల పులి నోటికే యిసిరెయ్యనీ.... మీ యిట్టం. నే పోతన్న" అన్నాడు.

# కనుపాప

అద్దంలో
నన్ను చూసుకున్నప్పుడు
కనుపించేది
నీవే సుమా!
అవును మరి
నా కను పాపలందు
నిలుపుకున్నది
నిన్నే కదా!!

గోవిందరాజు రామకృష్ణరావు

బా-వురమంది తానంగి.

పటేల్ చీమ కుట్టినవానిలా దిగ్గున లేచేడు. "ఆగరా జొన్నా. ఆగాగు. అలా తెంపేసుకపోటానికి కులమేవన్నా తల మాసిందేట్రా? నీ పిల్లనీ. నా పిల్లనీ కులాన ఏరుబందముందేట్రా? చెంపీక్క-దొర తప్పే జేసిండు. కాదనం. చేసీ సెప్పుత కొట్టు. అయితే మటుక్కు-దొర తప్పు జేసిండని కులపోడిలాగ ఆ దొరనీ కూసుండబెడదావేట్రా? అదంతా సులవేట్రా? నువ్వే జెప్పు" అన్నాడు.

జొన్నయ్య కళ్ళకడ్డంగా సుడులు తిరిగే కన్నీటిని రాల్చుకొంటూ "చంపీక్క-దొర్ని కూసుండబెడితె నా బిడ్డకీ, నాకూ వొరిగేదేంది? దొరని నిలిపేంతోడ్నా నేను?.... అడవిన తిరిగి బతికేవోణ్ని. నాకెందుకు దొరా ఆ అయ్యత పంతం? కాని.... కాని ఈ బిడ్డని సూడుదొరా .... ఆ నెత్తురు గుడ్డలు సూడు. దాని బతుకేంగాను? దాన్నె పుడేలుకుంటడు? ఆ మాట సెప్పండి దొరా...." ఆవేశమూ, దుఃఖమూ కలగలసిన పీలస్వరం.

నువ్వు బెంబేలుపడకురా జొన్నా.... కులం రానీ.... అంతా కలిపి ఏం సెప్పుతరో యిందాం. అప్పల్దాని మొగాన కొండదేవ రెట్టరాసిండో.... దీనికబూమ్మీద నూకలుండయో లేవో...." అన్నాడు వరదయ్య.

జొన్నయ్య విస్తుపోతూ చూసేడు. "బెంబేలు పడొద్దంటావా దొరా! కులాన్ని కూకోబెట్టి నా పిల్లకి న్నేయం సెపుతావా? హయ్‌రే! దొరా.... కడుపు పేత బట్టుకొని దేసం దిరిగే కులం. అడుపుల్లి దారెతుక్కుంటా తిరిగే కులం. కలిసేదెప్పుడు? న్నేయం జెప్పేదెప్పుడు?" దాదాపు ఏడుస్తూ అన్నాడు.


ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనావరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 పీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :

GAUTAM CHIKITSALAYA
(S-DD)
(P. O.) KATRI SARAI (GAYA)

దొర- తలచుట్టతీసి. మోకాలుమీదాన్చి. జుట్టువిప్పి. మళ్ళీ ముడేసేక— "మరేం సేద్దవో(.... అగ్గి నువ్వే సెప్పరా .. కులాన్ని కడుపులోకి ఎతుక్కో-కుండ కూకుండబెట్టేదా వంటావ్‌రా ?" అన్నాడు.

"అట్టెందుకంటరాన్న ! ఎవ్వరి కడుపు తీసి ఆరిదే ! మీ కడుపులు మాడ్చుకొని. నా పిల్లకోసం కూకోవ(ని సెప్పి. మీ పిల్లల వుసురు కట్టుకునే పాపిష్టోణ్ణి కామరన్నా .... అంతకంటే...." ఆపైమాటలు దొరక లేదో. మంచిది కాదనుకున్నాడో. జొన్నయ్య అకస్మాత్తుగా బిడ్డ చెయ్యి పట్టుకలాగుతూ "రావే. పోరీ ...ఎ సెట్టుకో వురేసుకుంటే పీడా యిరగడైద్ది." ఈసడింపుగా అని తుపుక్కున వుమ్మేస్తూ కదిలేడు.

"ఒరే ఆగరా జొన్నా.... అంతులికి పడితెట్ట. చంపీ్క-దార్ దొర నడుగుదాం. న్యాయం ఆయన్నె జెప్పమందాం. ఆ మారాజేం జెపుతడో యిందాం. పిల్లని తీసకెళ్ళి సూపిద్దాం. ఆయన" పూర్తి చెయ్యడానికి పటేల్‌కి ధైర్యం చాలింది కాదు.

"కాదంటే...." ఒక యువకుడు.

"మనాచారం అమల్జెయ్యాల్సిందే..." మరొక యువకుడు

"మొద్దును నడ్డి మీదేసి తొక్కా-ల్సిందే...." యింకొకరెవరో.

దొర నక్కి-ళ్ళు పోయేడు. "ఎవ్వ్రడాడు.... మీ మిడిసిపడ్తా్రను.... ఏం సెయ్యాల్నో. ఎట్టా సెయ్యాల్నో మాకటా సెప్పేది ?.... మీరేవీ( సెప్పక్కర్లె...." అని పళ్ళ బిగువుతో జనాన్ని గదమా యించేడు.

కోయజాతి కట్టడిని బట్టి ఎవరూ పెద్దలకు ఏ విషయంలోనూ ఎదురు చెప్ప కూడదు. చెపితే వినడం తప్ప. అడిగితే తప్ప. ఎవరినీ నోరిప్పడం - నేరం.

అయినా - జనంలో చాలామంది ఎదురు మాట్లాడటం మూలాన. జనం బలం తప్పును వొప్పు చేసినట్టుగా తయారయింది. దొర నల్ల(పక్క-లా సరకా యించి. సరాయించి. జనాన్ని సముదా యించేందుకు-"చంపీ్క-దారని భయపటం లే్ర్దా.... అడుగుత. నిలేస్త. కావాల్నొస్తే రాజు (పగిడిద్దె రాజు) ముందు నిలేసి. నిప్పు కొరకాసుతో శీలముండలు కాల్సు స్త ఆ(!....ఎర్కే్-నా?.... నీతికి బతికే కోయ పుటకరా మన్ది" అన్నాడు.

దొర మాటలకు జనం మాటేమోగాని పుగాకుకాడ నములుతున్నవాడల్లా. నోరు పడిపోయినట్లుగా. రెప్పలు తెగిపోయి నట్టుగా చూస్తుండిపోయేడు పటేల్.

"లేరా పటేలూ. పోదాం" అని కర్రందుకొని నిలుచ్చున్నాడు దొర.

అయోమయంలో అనుసరించేడు పటేల్.

## 3

దారి పొడవునా. దొరగానీ. పటేల్గానీ ఏవీ( మాట్లాడుకోలేదు. ఇద్దరి మనసుల్లోనూ ఒకే రకమైన తలంపులు కాని పని చేస్తున్నామనీ .. కీడేదో మూడక మానదనీ ....

చౌకీదార్ యింటిముందు బండి ఆగి వుంది బండి నిండా కట్టెలున్నాయి. గుమ్మంలో నిల్చొని చౌకీదార్ - ఎదురుగా చేతులు పిసుకు . ంటూ నిలుచున్న వానితో "యిగ్గో యింకోసారి జంగల్ కెల్తె. కేసు పెట్టి కచ్చేరికి నడిపిస్త జావ్" అని చేతిలోని డబ్బును జేబులో దాచేడు

వంగి వంగి దండం పెడుతూ దాటుకున్నాడతను.

"సువ్వ(ర్ కే బచ్చా.... యాభై రూపాయల్ యివ్వడాన్కి- సవ్వాల్. నీ తాతగాడి సొమ్మని కట్టెలు నర్కి-నావ్ బే ..." బండి వాణ్ణే చూస్తూ అని. వరండాలోని కుర్చీలో కూచొన్నాడు చౌకీదార్.

కోయదొరా. పటేల్ గుమ్మంలో నిలుచున్నారు. చౌకీదార్ వారిని చూసినా నిర్లక్ష్యంగా యింటిలో కెళ్ళేడు. బీడీ కాల్చుకొని తిరిగొస్తూ. "క్యారే....వచ్చి(ను? ఏంటి...." అన్నాడు.

దొర గుటకలేసేడు పటేల్‌కూడా అవే వేసేడు. ఒకర్నొకరు చూసుకొన్నారు. ఆ చూపుల్లో బతుకు తీపి. బతుకు భయం. బతుకు బరువు.

"క్యారే .... చెప్పు(ని....ఏంది... వచ్చి(ను. అరె: మీకి హడ్వాల దుంగల్ తిని ఎర్రిసూపు వచ్చిందేంటి?" ఎగతాళిగా అన్నాడు.

"దొరా........ అడ్వి మన్సులం. మీ వున్నన దినాలు గడుపుతుండాం వోనల పడ్డదాకా దయసూపండి. లేకుంటే ఈ ఎండల్ల మా పిల్లలు పిట్టల్లాగ కొట్టుకు సతరు."

"హచ్చా... హచ్చా.... మీకీ దయ సూడాల మాకీ బనాం సే తర్ హై. చొ... హడ్వాల దేకుసెట్టుకొట్టి. సీకట్లో ఎల్లాంది సెయుత్తు(ను కాదు ఆడు దొర్కి-తే బేకూఫ్ తో లియిస్త."

"అమ్మో.... లెద్దొరా.... మా గుంపెనెవుడూ సెట్టు నరకటంలే.... తేనె, గడ్డి తెచ్చుకుంటున్నం"

## బాల గోపాలం



'కరాటే నేర్చుకుంటున్నా జాగ్రత్త'
ఫొటో : ఆర్.ఎమ్. రత్నం. హైద్రాబాద్



## యువతరం

ఈ ఫిరంగి నిండా
మందుంది.
పేలిందంటే
గిరిదుర్గాలనైనా
పెళ్ళగించే శక్తి వుంది.
కానీ —
వత్తి ఎక్కడుందో-
అంటించే వాళ్ళెవరో-
అర్థం కావటంలేదు.

—పి. ఆర్. హరినాథ్

---

"హచాహై.... ఎళ్ళండి." లోని కెళ్లేడు చౌకీదార్.

## 4

గూడేనికి తిరిగొచ్చిన పెద్దలు - చౌకీదార్‌కి దండం పెట్టి తిరిగి రావడం తప్ప అడిగిందేదీ లేదని తెలిసి - యువకులు వుడికిపోయేరు. పెద్దల్ని యీసడింపుగా చూసేరు. తుపుక్కున వూసేరు.

దొరా, పటేల్ - అదోలా చూసేరు. నిటూర్చేరు. ఆ నిట్టూర్పులో "మన ఆకలి తీర్చే మారాజుని నిలేసి అడిగేందుకు దమ్ములు సాల్లేదురా ... గూడేనికి పెదల వేగాని, దొరలకే కాదురా...." అనే భావం వుంది.

జనం - రకరకాలుగా ఎగబడ్డారు? ఆకలీ, అభిమానాల్లో ముఖ్యమయినదేది?.. అనే తర్జనభర్జనలో - ఆ క్షణాన అభిమానానికి అండ దొరికింది. యివాళ తానంగి. రేపు మరొకతి! దీన్ని తాలివ్వనిస్తే - సివర్కి కులానికి మిగిలేదేంది? అడివిలో సెట్టుకొడితే పది రూపాయలు తప్పేసే మనిషి. మనిషి మానాన్ని కొడితే యెంత తప్పెయ్యాల్నో. ఏం చెయాల్నో వారినే అడుగుదాం" అన్నట్టుగా మాట్లాడేరు యువకులు.

నాగస్వరం ముందు నాగుబాముల్లా ఆ కొత్త భావాల్లో. అంతరాంతరాళ వెనుక అణగారిన ఆ భావాల్లో. ఉషారుగా కసిగా ఓ సంబరంలా జనం కదిలేరు.

## 5

చీకటి. బూజర బూజరగా అలుము కొంటూంది.

రోడ్డుమీద కోయలను చూసేసరికి చౌకీదార్ గతుక్కుమన్నాడు. పైకి తేలికగా కృత్రిమ నవ్వు జారవిడిచి. "క్యారే.... యాడికి పోతున్రు.... ఎల్లాందు సిలాకి కెల్తున్రు క్యా....?"

"మా బతుక్కి సిలాకి కూడానా?.... యింతకాలం- కూటికే అల్లల్లాడినం. యిగ నుంచీ...." ఓ పెద్దమనిషి నసిగేడు.

"క్యా.... కూటికి సత్తున్రు. అరె హల్లా మాకీ సెప్పుకోనాలా బేకూఫ్.... మేం సర్కార్ మన్సులం. కూలి సూయిత్తం."

చౌకీదార్ కూలి ముచ్చటించడం నచ్చని యువకులు ఏదో గొణిగేరు. ఒకడు గొంతు పెగిల్చి. "కూలి కాద్దొరా. తవ్వరు నిన్న పగులు........" అన్నాడు ముందు కొస్తూ.

ఆ మాటలు వినిపించనట్టుగా చౌకీదార్ పెద్దలతో "అరేయ్ రేపట్నుంచి మీ గూడెం మొత్తం మాకీ పన్కి రండి. హడ్వేల సెట్లకి నెంబర్లెయ్యాలి. సెక్క కొట్టుడుగాని. మా సర్కార్ అడితిల సుత వనుంది. సంఝే.... పాంచ్, ఐదు రూపాయిలిస్త" అన్నాడు.

"దొరా...." అసలు విషయం కదపాలని చూసే రొకరిద్దరు. గాని చౌకీదార్ నిలువకుండా "ఎళ్ళండి. నాకి నిద్దరత్తంది. రేపు పన్లెకి రాన్రి.... పోన్రి." అని టక్కున లోనికి పోయేడు.

జనం - చీమలు కుట్టినట్టుగా వులిక్కిపడ్డారు. ఆవేశంలోంచి ఆలోచనల్లోకి జారిపోయేరు కొందరు.

తమ బతుకులో ఏ మారాజూ ఎండాకాలం కూలి చూపించలేదు. అలాటిది — యివ్వాళ చౌకీదార్ ఐదు రూపాయలు కూలి సననే సరికి, వారిలో ఎక్కువ మందికి ఏవో.... ఏవేవో.... నిద్రపోతున్న కోరికలు మేల్కొన్నాయి.

కూలికోసం - తమ కోపం ఎరగావడం నచ్చని యువకులు - నోరెత్తబోయేసరికి - "ఉరేయ్ ... కూల్దొరకని రోజుల్ల మా రాజు పున్నెన పేగు కాత్తె సల్లబడేట్టుంది. నీతనీ. న్నేయవనీ. మా పిల్లల కడుపులు మాడవకండి. మీ కాళ్ళ మొక్కుతం. మా ఉసురు కట్టుకోకుండిరా...." అంటూ వెనుదిరిగేరు-పెద్దలు. పెదల్ని, యువకుల్ని మార్చి మార్చి చూస్తూ గొర్రెజనం కొంత మంది, యువకుల్నిచూస్తూ పెద్దల్ని అనుసరించేరు.

ఆకలి పేరున-తమ జవసత్వాల్ని. కోవతాపాల్ని. మానాభిమానాల్ని. నీరుగార్చిన చౌకీదార్‌ని లోలోపలే తిడుతూ తిడుతూ పెద్దల్ని వెంబడించేరు.

## 6

మరునాడు సాయంత్రం —

గూడెం జనంతో కలిసి. అడవిలో చెట్టు బెరడు తీసి. చౌకీదార్ యిచ్చిన ఐదు రూపాయలతో జొన్నయ్య గుడిసె కొచ్చేడు. భార్య కొనంగి మూకుడులో సంకటీ, గోలికాయంత ముద్దకారమూ వేసి జొన్నయ్య ముందుంచింది.

పగలంతా చేసిన కష్టంలో అలసిపోయిన జొన్నయ్యకు- సంకటిని చూసేసరికి కడుపులో పేగులరవసాగేయి. చెకచెకా ముద్ద కలుపుతూ అనుకోకుండా తలెత్తి తడిక ప్రక్కగా చూసేడు.

బిడ్డ తానంగి బొంతమీద పడుకొనుంది. సన్నగా స్వరం మూలుగేగాని. ఏడుపులా వుంది.

"పోర్దానికి వొళ్ళు వాపొత్తాంది. జెరం కూడా కాసింది. యిప్పుడే వుడుకుడుకు గంజి తాపిన, అట్ట కన్ను మలిగింది." అంది కొనంగి.

నిట్టూర్పు విడుస్తూ తలూపేడు జొన్నయ్య. మూకుడు కేసి చూసేడు.

ముద్ద కారం కలిపిన సంకటి- ఎర్రగా.. తన బిడ్డ చినిగిన మానం లోంచి చిందిన నెత్తురులా అనిపించింది. కొన్ని నిముషాలు.... జొన్నయ్య ముద్ద ఎత్తలేకపోయేడు.

గుండెల్లోంచి - అపరిమితమైన అసహాయత లోంచి. బయల్పడిన ఓ వేడి నిట్టూర్పుతో పాటు రెండు కన్నీటి చుక్కలు రాలి మూకుడులో పడి, నెత్తురు నంతా కడిగేసినట్లయింది.

జొన్నయ్య ముద్ద ఎత్తేడు. ★

---

## బాల గోపాలం



ఏడవకు, ఏడవకు ఎర్రిపాపాయి
ఏడిస్తే నీ కళ్ళు ఎర్రనౌతాయి!

ఫొటో: వి.వి. హరిహరరావు. బరంపురం